
# మహానగరం కథలు -వేదుల సుభద్ర





## విశ్వచక్రం

*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహో" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

**"అరే! విశ్వం అంకుల్..** ఎన్ని రోజులయింది? మీరు కనిపించనేలేదు. ఎలా ఉన్నారు?" దాదాపు పదిహేనిరవై రోజుల తర్వాత గ్రౌండ్‌లో కనిపించిన అతన్ని అడిగాడు హర్ష.

"ఓ హర్షా, బావున్నావా బాబూ? ఏదో కొద్దిగా ఒంట్లో బాగోలేక కిందకి రాలేదు" అన్నాడు ఆయన.

"అరే, అలానా? ఏమయింది? మీరు రోజూ నకుల్, నైమిషలని తీసుకుని కిందకి వస్తారు కదా, ఈ మధ్య రాలేదని యామిని కూడా అంది. మొన్నొకరోజు వచ్చాము మీ ఫ్లాట్ కి, తాళం వేసి ఉంది. ఈ లోపున నేను బిజీ అయిపోయాను. యామిని కూడా శార్దూల్ కి ఆరు నెలలు నిండుతున్నాయి కదా, మళ్ళీ జాయిన్ అవ్వాలని అనుకుంటోంది.. దాంట్లో బిజీ అయిపోయాము "అన్నాడు..

"యామీ..! అంకుల్.." అని పిలిచాడు.

పిల్లవాడిని ప్రాంలో తిప్పుతున్న యామిని కూడా పరుగున వచ్చింది "అంకుల్ ఎలా ఉన్నారు?"అంటూ.

" బావున్నాను తల్లీ, చిన్నవాడేం చేస్తున్నాడు? ఇప్పుడే హర్ష అంటున్నాడు నువ్వు మళ్ళీ జాయిన్ అవుతున్నావని.."అంటూ నెమ్మదిగా కబుర్లు చెప్పసాగాడు..

బొంబాయిలోని అనేక అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లలో అది కూడా ఒకటి. కానైతే మరీ పిచిక గూళ్ళల్లా కాకుండా విశాలంగా ఉంటుంది. ఈ మధ్యన వస్తున్న స్విమ్మింగ్ పూల్, జిం, లాంటి హంగులన్నీ ఉండి ఎంతో అధునాతనంగా ఉంటుంది. మూడు బ్లాక్‌లుగా కట్టిన కాంప్లెక్స్‌లో మధ్యలో కాస్త ఎత్తగా పిట్టగోడల్లాంటివి లేపి దాంట్లో పది లారీల ఇసక పోసి, పిల్లలు ఆడుకునే స్థలం తయారుచేసారు. దాంట్లోనే నాలుగైదు ఉయ్యాలలు, జారుడు బండల్లాంటి ఆట సాధనాలు సమకూర్చారు.

చుట్టూరా మూడు ఎత్తైన భవంతులవల్ల పొద్దున్న కూడా చాలాసేపటివరకూ అక్కడకి ఎండ రాదు. దానివల్ల అక్కడ ఎప్పుడూ పిల్లల సందడి. అమ్మలూ, అమ్మమ్మ, నాయనమ్మలూ, తాతయ్యలూ, వీరెవరూ ఇంట్లో లేకపోతే పిల్లలని చూసుకునే ఆయాలు, ఇలా అందరూ దాదాపూ రెండు పూటలా అక్కడ చేరి పిల్లలనాడిస్తూ ఉంటారు. లేదా వాళ్ళు ఆడుకుంటూ ఉంటే వీళ్ళు కనిపెట్టుకుని చూసుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ ఉంటారు.

అలా రోజూ తన మనవలని తీసుకుని వచ్చే విశ్వంగారు మరీ ప్రత్యేకం. ఆయనా, భార్యా తమ కొడుకు గౌతం, కోడలు విద్య లతో కలిసి ఉంటారు. ఆయన రిజర్వ్ బాంక్ లో పనిచేసి రిటైర్ అయ్యారు. ఆయన భార్య వసంత స్కూల్లో టీచర్‌గా పనిచేస్తారు. కొడుకూ, కోడలూ డాక్టర్లు. ఇద్దరికీ క్షణం తీరిక లేని పని. కోడలు విద్య రేడియాలజిస్ట్, కొడుకు పీడియాట్రీషియన్. ఇద్దరూ ఒకే హాస్పటల్ లో పనిచేస్తారు. మరొకరెండు చోట్ల కన్సల్టింగ్ చేస్తారు.

భార్య కూడా ఇంకా రోజూ ఉద్యోగానికి వెళుతున్నా సరే ఆయనే దగ్గరుండి మనవల ఆలనా పాలనా చూసుకోవడాన్ని అందరూ ఎంతో ఇష్టంగానూ, స్పెషల్ గానూ చెప్పుకుంటారు. ఉదయం నిద్ర లేచినది మొదలు రాత్రి పిల్లలు పడుకునే దాకా ప్రతీ నిమిషమూ ఆయనకి వాళ్ళ పనిలోనూ, లేదా వారి ధ్యాసలోనూ గడుస్తోందంటే అతిశయోక్తి కాదు.

మనవలిద్దరూ చిన్న పిల్లలు. మనవడు నకుల్‌కి ఏడేళ్ళు, మనవరాలు నైమిషకి ఐదు. ఇద్దరూ ఒకే స్కూల్‌కి వెళతారు. నకుల్‌కి స్కూల్ పొద్దున్నే మొదలయి మూడు గంటలవరకూ ఉంటుంది. నైమిషకి పన్నెండున్నరకి మొదలయి మూడువరకూ ఉంటుంది. పొద్దున్న ఆయన భార్య వంట చేస్తే, మిగిలిన ముగ్గురూ ఇల్లూ, పిల్లల పని చూస్తారు. పిల్లలని తయారుచేసి, టిఫిన్ తినిపించి స్కూల్ బస్ ఎక్కించడం ఆయన పని. మధ్యాహ్నం మాత్రం నైమిషని తీసుకుని కార్‌లో దింపి వస్తారు. మళ్ళీ మూడింటికి ఇద్దరినీ తీసుకుని వస్తారు. వచ్చాకా వాళ్ళకి బట్టలు మార్చి, లంచ్ తినిపించడం అదీ చూస్తారు. ఈలోపున వాళ్ళ నాన్నమ్మ వచ్చేస్తారు.

నకుల్ హోం వర్క్‌లు అవీ పూర్తయ్యాకా కొంచం చల్ల బడ్డాకా, వాళ్ళిద్దరినీ తీసుకుని కిందకి వస్తారు. వారానికి రెండు రోజులు నకుల్ గిటార్ క్లాస్‌కి వెళతాడు. అలా పిల్లలని క్షణం కూడా వదలకుండా కంటికి రెప్పల్లా చూసుకుంటారు. విద్య ఫ్రెండ్స్ అందరూ

ఆమెని చూసి ఎంతో అసూయ పడతారు.. అరమరికలు లేకుండా తల్లితండ్రుల్లా చూసుకునే అత్తమామలు, ఇంటి పనీ, పిల్లల పనీ, అని లేకుండా చూసుకుంటారు అని.

వారిద్దరినీ కూర్చోబెట్టి ఎన్నో రకాల ఆటలు ఆడించడం, కథలూ కబుర్లూ చెప్పడం.. ఇలా ఎన్నో! శని ఆది వారాలొస్తే, ఎప్పుడూ పనే కాదు లోకం అంటూ, కొడుకు కోడలిని బయటకి పంపి మరీ చూసుకుంటారు. పొరపాటున పిల్లలకేదైనా వస్తే ఇంక ఒక్క క్షణం కూడా నిద్రపోకుండా వాళ్ళని కనిపెట్టుకుని ఉంటారు. పేరుకు ఆవిడ వెంటే ఉన్నా విశ్వం గారే ఎక్కువగా ఇవన్నీ చేసేది.

' ఎంత ఓపికో ఆయనకి.. అమ్మలకి కూడా ఉండదు' అనుకుంటారు ఆయన్ని చూసినవారు.

యామినికి, హర్షకి వాళ్ళతో పరిచయం చిత్రంగా అయింది. యామినికి ఏడో నెల నడుస్తుండగా ఒక రోజున పొరపాటున ఎత్తుమడమలున్న చెప్పులు వేసుకుని కిందకి వాకింగ్‌కి వచ్చింది. హర్షతో కబుర్లు చెపుతూ నడుస్తున్నదల్లా, కాలు మెలిక పడడంతో అధాట్టున పక్కకిపడబోయింది. నైమిష చెయ్యి పట్టుకుని నడుస్తున్న విశ్వంగారు, ఆమెని ఆపి పట్టుకుని 'జాగ్రత్తమ్మా' అని మొదట అసంకల్పితంగా తెలుగులో అనేసి, తర్వాత సర్దుకుని.. 'దేఖ్ కే బేటా' అని హిందీలో అన్నారు. 'ఆర్ యూ ఒకే?' అని అడుగుతూనే పిల్లల ఆట స్థలం గట్టు మీద కూర్చోబెట్టారు.

"మీరు తెలుగువారా?" అని అడిగారు యామినీ, హర్షా ఒకేసారి. అది కొత్తగా కట్టిన కాంప్లెక్స్ కావడాన ఇంకా అందరికీ బాగా పరిచయాలు కాలేదు.

" అవును..మీరూనా?" అంది వసంత అప్పటికే అక్కడకి వచ్చి. అలా మొదలయింది వాళ్ళ పరిచయం.

'పొరపాటున కూడా ఎత్తు చెప్పులు వేసుకోను 'అని యామిని దగ్గర మాట తీసుకున్నారు

అప్పటినించీ రోజూ "యామినికి" అంటూ స్వీటో, మావిడికాయ పులుసో, ఫ్రెష్‌గా నూరిన పచ్చడో ఇలాఏదో ఒకటి వచ్చేది వారింటినించి. వారి పిల్లలు కూడా ఎంతో బాగా మాట్లాడారు. కోడలు విద్య అరవమ్మాయి అని చెప్తేనే కానీ తెలియలేదు. అంత బాగా కలిసిపోయిన కుటుంబాన్ని చూసి హర్షా, యామినీ కూడా ఎంతో ముచ్చట పడ్డారు. హర్షకి తల్లితండ్రులు లేరు. ఒక్క అక్క అమెరికాలో ఉంటుంది.

అలా కొద్దికాలంలోనే వారి స్నేహం బలంగా మారింది. యామినికి ప్రసవ సమయంలోనూ, తర్వాత కూడా వారిద్దరూ ఎంతో సహాయం చేశారు. ముఖ్యంగా తెలుగు తప్ప మరొక భాష రాని యామిని అమ్మా నాన్నలకి. ఆయన నైజమే అంత.. ఒక్కనిమిషం ఖాళీగా ఉండడాన్ని ఇష్టపడరు. రకరకాల భాషలలో అందరితోనూ సందడిగా మాట్లాడుతూ ఎంతో కలివిడిగా ఉంటారు. అలా అని అక్కరలేని విషయాలు కానీ, పర్సనల్ విషయాలు కానీ ఎప్పుడూ మాట్లాడరు. ఎవరికేసహాయం కావలన్నా ఆయనే ముందు.

రోజూ కనీసం ఒకసారి కలిసే వారు. ఒకవేళ కింద కలవడం కుదరకపోతే "మా మనవడేం చేస్తున్నాడు?" అంటూ రెండు రోజులకొకసారి వచ్చేవారు ఇద్దరూ.

"వచ్చేనెలలో మీ ఆంటీ రిటైర్ అయిపోతుందమ్మా, నన్నొక్కడినే ముసలాడు అని ఏడిపించలేదు ఇంక" అన్నారు నవ్వుతూ ఒకరోజు.

ఆవిడ రిటైర్మెంట్‌కి క్లబ్ హౌస్‌లో చిన్న పార్టీ ఇచ్చారు. ఆవిడ చదువు చెప్పిన పిల్లలలోంచి ముంబై లోనే ఉన్న కొందరి వివరాలు కనుక్కుని పార్టీకి పిలిచి మరీ చూపించారు. ఈ వేడుకనంతా అతిథులంతా ఎంతో ముచ్చటగా చూశారు. వారి కోడలు విద్య 'మహాగణపతిం, బంటురీతి' లాంటి రెండు మూడు కీర్తనలు పాడింది. ఆమె చిన్నప్పటినించీ సంగీతం నేర్చుకుంది .అప్పుడప్పుడు కచేరీలు కూడా చేస్తుంది.

అలాంటిది.. ఈ మధ్యన పదిహేను రోజులు కనిపించలేదంటే చాలా వింతే. " పైకి మాములుగానే మాట్లాడుతున్నారు కానీ, అంకుల్ ఎందుకో సరిగాలేరు అనిపిస్తోంది నాకు" అంది యామిని వాళ్ళకి బై చెప్పి వచ్చేశాకా.

" అవునా? నాకు బాగానే ఉన్నారే? " అన్నాడు హర్ష.

" నో..ఆయన అంత డల్‌గా ఉండడం నేనెప్పుడూ చూడలేదు. బహుశా పిల్లలని మిస్ అవుతున్నారేమో, విద్య ఈ మధ్యనే వాళ్ళని తీసుకుని చెన్నై వెళ్ళింది" అంది యామిని..

"ఓకే. గౌతంని అడిగి చూడనా?" అన్నాడు హర్ష.

రాత్రి డిన్నర్ అయ్యాకా 'వాక్ కి వెళదాం' అని గౌతంని బయటకి తీసుకొచ్చాడు. ఇద్దరూ బిల్డింగ్ చుట్టూ తిరుగుతున్నారు. చల్లగా గాలి వేస్తోంది.

"అంకుల్ బాగానే ఉన్నారా? ఏనీ ప్రోబ్లెం. ఇలా డైరెక్ట్‌గా అడుగుతున్నానని మరోలా అనుకోవద్దు" అన్నాడు హర్ష.

"దాదాపు పదిహేను రోజులుగా కిందకే రాలేదు వాళ్ళిద్దరూ. ఈ రోజు కూడా అంత యాక్టివ్‌గా, ఎప్పుడూ ఉండేలా కనబడలేదు. ఆయన్ని మేమేమీ అడగలేదనుకో "అన్నాడు.

"థాంక్ యూ అడగనందుకు. ఒకరకంగా మా ఇంట్లో కొంచం ఫ్రిక్షన్ నడుస్తోంది గత కొద్ది రోజులుగా అన్నాడు" గౌతం మెల్లగా..

"వాట్ మీ ఇంట్లో ఫ్రిక్షనా? ఐ కాంట్ బిలీవ్ ఇట్! మరో మాట చెప్పు" అన్నాడు హర్ష నవ్వుతూ..

గౌతం నవ్వలేదు " ఫ్రిక్షన్ అంటే గొడవలేమీ కాదు. నేను నాలుగేళ్ళ క్రితం మిడిల్ ఈస్ట్‌లో ఒక హాస్పటల్‌లో చీఫ్ పిడియాట్రీషియన్ పొజిషన్‌కి అప్లై చేస్తే అది ఇప్పుడు మూవ్ అయింది. వాళ్ళు నాకు జాబ్, నేనడిగిన జీతం ఇవ్వడానికి రెడీగా ఉన్నారు, అలాగే విద్యకి కూడా అసోసియేట్ పోస్ట్ ఇస్తామని అన్నారు. మంచి సేలరీ, టాక్స్ ఫ్రీ..నాలుగైదేళ్ళు పని చేసినా చాలా బావుంటుంది కదా అని అనుకుంటున్నాము.

అమ్మా, నాన్నా పైకి చెప్పడం లేదు కానీ, వాళ్ళు మమ్మల్ని బాగా మిస్ అవుతారు. ముఖ్యంగా పిల్లలని. మా కెరీర్‌లకి అడ్డుగా ఉండలేక, పిల్లలని వదిలి ఉండడమనే ఊహ భరించలేక వాళ్ళు చాలా సఫర్ అవుతున్నారు. ముఖ్యంగా నాన్న.. పొద్దున్న లేస్తే వాళ్ళు పడుకునే దాకా వాళ్ళు మెలకువగా ఉన్న ప్రతీ నిమిషమూ ఆయన వాళ్ళతోనే ఉంటారు. వాళ్ళతో గడపడమే ఆయనకి న్యూస్ పేపర్,టీ.వీ, అన్నీ. అలాంటిది ఒక్కసారిగా ఒంటరిగా ఉండగలరా? అనేది మాకో పెద్ద వర్రీ అయిపోయింది.

నేను చేస్తున్నది రైటో తప్పో కూడా తెలియడం లేదు నాకు. ఒక్కోసారి అసలీ ప్రాపోజల్ డ్రాప్ చేసేసుకుంటేనో అనిపిస్తోంది. కానీ.. ఇది నిజంగానే మంచి ఛాన్స్ నాకు. నిజంగానే డెసిషన్ మేకింగ్ ఎంత కష్టమో"అన్నాడు.

"ఓహో అదన్నమాట కారణం. నేను అంకుల్‌ని అడిగిచూడనా ఏమంటారో? " అన్నాడు అనునయంగా.

"ఏమనడానికి అసలిప్పుడు వద్దని అంటేగా? పైకి చాలా మాములుగా ఉండడానికే ట్రై చేస్తున్నారు. పోనీ గట్టిగా వాళ్ళు వద్దన్నా నేను మానేసేద్దునేమో, నాకు అది ఇంకా ఈజీ అయ్యేది" అంటున్నాడు గౌతం.

హర్షకి కొద్దిగా నవ్వు వచ్చింది. అప్లై చేసినప్పుడు 'వచ్చినప్పుడు చూద్దాం లే' అనుకుని ఉంటాడు. కానీ అసలు పరిస్థితికి వచ్చేటప్పటికివెళ్ళలేక, ఉండలేక సతమవుతున్నాడు. జీవితంలో ఎప్పుడూ ఇంతే కదా అనుకున్నాడు.

"ఇండియాలో డాక్టర్ల సంగతి నీకు తెలియనిదేముంది? అందుకే కొన్నాళ్ళు బయట ఉండి డబ్బూ, అనుభవం తెచ్చుకుంటే బావుంటుంది కదా, తర్వాత మా ఫ్రెండ్స్ ఒక డాక్టర్ కపుల్ ఉన్నారు. నలుగురం కలిసి ఒక నర్సింగ్ హోం పెట్టుకుంటే బావుంటుందని మా ఆలోచన." అన్నాడు అన్యమనస్కంగానే.

''పరవాలేదులే గౌతం..దుబాయ్ ఎంత దూరం? మీరు వెళ్ళిరండి.. అంతగా నచ్చకపోతే తిరిగి వచ్చేయవచ్చు.. అంకుల్ వాళ్ళు కూడా వీలున్నప్పుడల్లా రావచ్చు మీ దగ్గరకి. గట్టిగా మాట్లాడితే నాలుగు గంటల ప్రయాణం. అంతే కదా.'' అన్నాడు హర్ష వాతావరణాన్ని తేలిక చెయ్యడానికి ప్రయత్నిస్తూ.

మర్నాడు పార్క్‌లో కనిపించినపుడు విశ్వం అంకుల్ తనంతట తానే గౌతం వాళ్ళ ప్రయాణం గురించి మాట్లాడారు. తను నిన్న రాత్రి తెలుసుకుని ఉంటానని ఊహించి ఉంటారని అనుకున్నాడు హర్ష.

''మేమెంతో జీవితాన్ని చూసిన వాళ్ళం హర్షా, మీరు చిన్నపిల్లలు.. అవకాశం వచ్చినప్పుడు ట్రై చెయ్యడంలో తప్పు లేదు. వాడెంతో కష్టపడి చదివేవాడు చిన్నప్పటినించీ. మేమెప్పుడూ ఇది చదువు, ఇలా చదువు అని చెప్పనేలేదు. తనే మెడిసిన్ చదువుతానని, పట్టుపట్టి సీట్ సాధించాడు. ఏ పని చేసినా ఎంతో సమర్ధతతోనూ, సిన్సియర్ గానూ చేస్తాడు. ఏదో ఫీజ్ కట్టాను తప్ప వాడికేమీ ప్రత్యేకంగా చెయ్యలేదు. వాడికి కావలసినవన్నీ వాడే కూర్చుకున్నాడు.

ఎవరి లైఫ్ అయినా ఒక చోట ఆగిపోకూడదు కదా. కాల చక్రంలాగే బ్రతుకుచక్రం కూడా సైకిల్ చక్రంలాగే తిరుగుతూనే ఉంటుంది, ఉండాలి. ఈరోజు కిందున్న ఊసలు రేపు పైకి వస్తాయి, అంతే కానీ ఆగిపోవు కదా! అలా చూస్తే నేను మాత్రం..

మా నాన్నగారికి ఇష్టం లేకపోయినా అక్కడున్న ఉద్యోగం ఎస్.బీ.ఐ లోది వదిలి మరీ వచ్చాను. రిజర్వ్ బాంక్‌లో ఆఫీసర్ పోస్ట్ కదా అని. మా ఊరికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉద్యోగం, సరదాగా హాయిగా సైకిల్ మీద వెళ్ళేవాడిని. హాయిగా వెండి కంచంలో భోజనం, వెండి వెన్నెల్లో మలయమారుతం. మీ ఆంటీ మా అమ్మ వెనకే ఉండీ మంగళగౌరీ వ్రతాలు అవీ చేసుకుంటూ, ముద్దరాలిలా ఉండేది. అంత విశాలమైన ఇల్లూ, వాకిలీ, మా వాళ్ళనందరినీ వదిలి ఇక్కడ చిన్న ఇంటిలో కాపరం పెట్టినప్పుడు మాత్రం నాన్న కొంచం బాధ పడ్డారు.

'ఒరే, అసలే నీ కాళ్ళూ చేతులూ పొడుగు.. జాగ్రత్త' అని. అంతే కానీ నా భవిష్యత్తుకి కానీ, నేను తీసుకున్న నిర్ణయాన్ని కానీ ఎప్పుడూ తప్పు పట్టలేదు. వద్దనలేదు. నేనూ అదే నేర్చుకోవాలి కదా. తనకోసం నన్ను అక్కడే ఉండి పొమ్మనలేదు. కానీ ఇక్కడ మాత్రం ఇమడలేకపోయారు. ఏదో చుట్టపు చూపుగా నాలుగు రోజులిండి వెళ్ళిపోవడమే తప్ప ఎప్పుడూ ఎక్కువ రోజులుండలేదు.

గౌతంతో గడపాలని ఆయనకి చాలా ఉండేది. కానీ కుదిరేది కాదు. అదొక్కటే బాధ ఆయనకి నాకు తెలిసి.

కానీ నేను అలా కాదే. నకుల్ పుట్టినప్పటినించీ అన్నీ నేనే చూసుకున్నాను. ఇప్పుడు దూరం వెళ్ళిపోతాడనుకో, అది వేరే విషయం. నైమిష ఐతే వాళ్ళ అమ్మ కన్నా, నాన్నమ్మ కన్నా ముందు నన్నే తలుస్తుంది. పిల్లలు కదా, కొన్నాళ్ళకి మర్చిపోతారనుకో. అయినా నాలుగైదేళ్ళే అంటున్నాడు కదా, ఎంతలో తిరుగుతాయి.? అప్పటికి నకుల్‌కి పన్నెండేళ్ళొస్తాయి. ఎంత పొడుగవుతాడో?''

మనసులో ఒకదానికొకటి సంబంధం లేకుండా మెదులుతున్న ఆలోచనలని అలాగే బయటకి వ్యక్తపరుస్తుండడం వల్ల అలా ఒకదానికొకటి సంబంధం లేకుండా మాట్లాడేస్తున్నారు.

అయినా ''దుబాయ్ ఏమీ అమెరికా కాదు కదా, నాలుగు గంటల్లో వెళ్ళి రావచ్చు కదా'' అన్నారు నవ్వుతూ.

''అమెరికా అయినా ఈ రోజుల్లో నిమిషాలమీద వెళ్ళి వస్తున్నారు. మీరు హాయిగా ఉండండి, మేమందరమూ లేమూ'' అన్నాడు హర్ష.

అలా దాదాపు ఒక నెల తర్వాత గౌతం, విద్యా పిల్లలని తీసుకుని దుబాయ్ వెళ్ళిపోయారు. అక్కడ వారికీ, ఇక్కడ వీరికీ కూడా చాలా కష్టం అయింది కొత్తలో, ఒకరిని వదిలి ఒకరు ఉండడం. ఫోన్‌లో అంకులే ధైర్యం చెప్పేవారు. విద్య అయితే ' నకుల్ ని ఇక్కడికే పంపేద్దామా ' అనుకుంది కానీ పిల్లలు మొదటగా ఉండవలసింది తల్లిదండ్రులదగ్గర అని అంకుల్ మరీ మరీ చెప్పారు. ' అంతగా బెంగ పెట్టుకుంటేఅలాగే చూద్దాం ' అన్నారు.

వాళ్ళు వెళ్ళాక హర్ష, యామినీ చాలా బిజీ అయిపోయారు. యామిని తిరిగి ఉద్యోగానికి వెళ్ళడం, బాబు కోసం పెట్టుకున్న - ఆయాలు సరిగా వచ్చీ, రాకా విసిగించడమూ, బాబుకోసమని వచ్చిన యామిని అమ్మ బాత్ రూంలో పడి కాలు విరగడమూ ఇలా రకరకాల కారణాల వల్ల వారు విశ్వం దంపతులని కలవడమే కుదరలేదు.

ఒక రోజు పని గట్టుకుని మరీ ఇద్దరూ వారింటికి వెళ్ళారు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. మెల్లగా తలుపు చప్పుడు చేస్తే వసంత వచ్చి తలుపు తీసారు..

సోఫాలో కూర్చుని పేపర్ చదువుతున్న విశ్వం గారిని చూసి ఆశ్చర్య పోయారు..

"అదేంటి అంకుల్ అంత డల్‌గా కనిపిస్తున్నారు? " అని అడిగారు.

" లేదమ్మా, బావున్నాను" అన్నారాయన..

"పిల్లలని మిస్ చేస్తున్నారు" అంది వసంత..

"మరి అదేవిటంకుల్. ఆరోజు ఏమన్నారు? లైఫ్ సైకిల్ చక్రం లాంటిది, తిరుగుతూనే ఉండాలి, ఈ రోజు పైనున్న ఊసలు రేపు కిందకి, మళ్ళీ అవే పైకి.. అన్నారు..ఇప్పుడేమిటిలా? అన్నాడు హర్ష నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"అవును బాబూ.. అప్పుడు నేననుకోలేదు.. మనవలనే లూబ్రికెంట్సు లేకపోతే ఈ **విశ్వచక్రం** తుప్పు పట్టేస్తుందని. నాకిప్పుడు తెలుస్తోంది, చెప్పడమెంత తేలికో, తన దాకా వస్తేనే తెలిసేది నిజమైన కష్టమేమిటో అని. పాపం మా నాన్న కూడా ఇంతేగా?" ఆయన గొంతులో తడి.

" పరవాలేదులే.. ఐ విల్ బీ ఒకే సూన్. మీకు తెల్సా, గౌతం నిన్ననే చెప్పాడు. మాకు వీసా ప్రాసెస్ మొదలుపెట్టాడు, మరొక నెల పట్టచ్చు. మేము మరోక నెలలో దుబాయ్ వెళతాము. అప్పుడు చూస్తాను మా లిటిల్ డెవిల్స్‌ని. దాని తర్వాత ఐ విల్ బీ ఫైన్. అదిగో నా కౌంట్‌డౌన్!" కాలెండర్ మీద ఎర్రని సున్నా చుట్టిన రోజు తారీఖుని చూపిస్తూనే శార్దూల్‌ని చేతులు చాపి ఎత్తుకున్నారు..

ఆ కాలెండర్‌ని చూస్తుంటేనే పిల్లలని చూసినంత ఆనందంతో మెరుస్తున్నాయి ఆయన తడి కళ్ళు!!

Click here to share your comments on this story